చైనాలో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నీకి హనుమకొండ బాలిక ఎంపిక





PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd


కమలాపూర్‌లో బొజ్జ గణపయ్య నిమజ్జనం...





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 271 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 25 సెప్టెంబర్ 2026


## 22ఏ భూముల వ్యవహారంపై
# కొత్త కమిటీ

● పలు జిల్లాల్లో భూ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణకు ప్రభుత్వం నిర్ణయం




**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో 22ఏ భూముల వ్యవహారంతో పాటు పలు జిల్లాల్లోని భూములకు సంబంధించిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 16న శాసనసభలో 22ఏ భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ అనంతరం మరింత లోతైన పరిపాలనా విచారణ అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది.కమిటీకి కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన అధ్యక్షురాలిగా వ్యవహరించనున్నారు. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. సంబంధిత జిల్లాలకు మిగతా2లో...



## నెల రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా తనిఖీలు

- మంత్రి దామోదర కీలక ఆదేశాలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి ఆస్పత్రి కూడా ఫైర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించేలా, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను పటిష్టంగా అమలు చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్ రూపొందించాలని అధికారులను రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రోగులు, సిబ్బందిని సురక్షితంగా తరలించేలా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో నెల రోజుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీల ఆడిట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆస్పత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీలపై ప్రతి ఆరు నెలలకోసారి, భవనాల నిర్మాణ పటిష్టతపై మిగతా2లో...

# వెల్‌కమ్...కామ్రేడ్

● జిన్‌పింగ్‌కు రెడ్‌కార్పెట్ స్వాగతం ● స్వయంగా ఆహ్వానించిన ట్రంప్



**వాషింగ్టన్ సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** వాణిజ్యం, సాంకేతికత, తైవాన్, ఇరాన్ వంటి అంశాలపై రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికాలో చైనా అధినేత జిన్‌పింగ్ పర్యటన ప్రారంభమైంది. అగ్ర రాజ్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు పరీక్ష పెట్టే మూడు రోజుల పర్యటన కోసం వాషింగ్టన్ చేరుకున్న జిన్‌పింగ్‌కు మిగతా2లో...

## దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరణ.. పిటిషన్ కొట్టివేత



**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించిన అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించినట్లు పేర్కొంటున్నా రు. ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మరో పార్టీ మిగతా2లో...




## జ్ఞానేష్ కుమార్ దేశద్రోహి రాజీనామా చేయాలి

- ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

**హైదరాబాద్:సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే సర్ సర్వే పై కేంద్ర ఎన్నికల కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తాయని జాతీయ మీడియాల్లో కథనాలు వచ్చాయి. దీంతో ప్రధాన ఎన్నికల మిగతా2లో...

## నీటి సంపుల్లో పడి ఇద్దరు బాలుర మృతి

- మహబూబ్‌నగర్ జిల్లాలో విషాదం



**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలురు నీటి సంపుల్లో పడి మృతి చెందారు.నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్రలో బీహార్‌కు చెందిన ఎనిమిదేళ్ల ఆర్యన్ నీటి సంపులో పడి మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మరో ఘటనలో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరికి చెందిన 13 ఏళ్ల హనుమంతు కొండారెడ్డిపల్లి మిగతా2లో...

# జూరాలకు కృష్ణా జలాలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం పంటలను కాపాడటంతో పాటు తాగునీటి అవసరాలు తీర్చేందుకు కృష్ణా జలాలను జూరాల ప్రాజెక్టుకు విడుదల చేయించినట్లు రాష్ట్ర అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం వనపర్తి కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులతో కృష్ణా జలాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, తాగునీటి అవసరాల కోసం సుమారు 18.19 టీఎంసీల నీరు అవసరమవుతుందని తెలిపారు.ప్రస్తుతం జూరాలలో ఉన్న సుమారు 7 టీఎంసీల నీటితో పాటు కర్ణాటక నుంచి వచ్చే నీరు, ఇతర వరద మిగతా2లో...

## ఆయిల్‌పామ్ రైతులకు దెబ్బ

- సుంకం తగ్గింపుపై మంత్రి తుమ్మల ఆగ్రహం



**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బ తీసేలా కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు రైతులను ఆయిల్ పామ్ మిగతా2లో...

## 48 గంటల్లోగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే






## నాపై కాంగ్రెస్ నేతల తప్పుడు ప్రచారం

● దానంపై సుప్రీం తీర్పు.. రేవంత్‌కు చెంపపెట్టు : హరీశ్‌రావు ● పరువు నష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరు

**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వాళ్లు బురదలో ఉండి.. ఆ బురదను తమకు అంటించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేస్తే భవిష్యత్తులో ఎవరినీ వదిలిపెట్ట బోమని హెచ్చరించారు. తాను క్షుద్రపూజలు చేయిస్తున్నానని ఆరోపించిన కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేసిన హరీశ్‌రావు.. ఈ కేసు విచారణకు గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు

మిగతా2లో...

# 48 గంటల్లోగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

**హైదరాబాద్:సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్)::** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ భారతదేశ ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించారని డిప్కే ఆరోపించారు. ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ఎవరు ఓటు వేయాలి , ఎవరు వేయకూడదు అనే విషయాన్ని ప్రభుత్వమే నిర్ణయిస్తోందని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించబడ్డాయి. ఇది చిన్న సంఖ్య కాదు, ఈ తొలగింపు మొత్తం ఓట్లలో సుమారు 13-14 శాతానికి సమానమని తెలిపారు.ఈ నేపథ్యంలో తాజా పత్రికా సమావేశంలో అభిజీత్ దీప్కే సీఈసీ జ్ఞానేశ్ కుమార్పై మండిపడ్డారు. ఈ ఉదంతాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ దేశంలోనే అతిపెద్ద దేశద్రోహి అని నిరూపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాబోయే 48 గంటల్లోగా ఆయన రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసనలకు తెరతీస్తామని అల్టిమేటమ్ జారీ చేశారు.

# నాపై కాంగ్రెస్ నేతల తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 30న తన స్టేట్మెంట్ను నమోదు చేస్తామని కోర్టు చెప్పిందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్రెడ్డికి చెంపపెట్టు లాంటిదన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడాలని స్పీకర్ ప్రయత్నించారని, కానీ.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ఆ ఎమ్మెల్యేలకు గుణపాఠంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతైనా వారికి కనువిప్పు కలగాలన్నారు. రాజ్యాంగ సంరక్షకుడిగా వ్యవహరిస్తానన్న కాంగ్రెస్ నేత రాహుల్గాంధీ ఇప్పుడేమి చేస్తున్నారని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలతో ఆయన రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్కు పాల్పడుతోందని, సీఎం రేవంత్రెడ్డి చెప్పిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని హరీశ్రావు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా ఇప్పటివరకు డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదని, సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోవడం లేదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు మాటలతో కాలం గడుపుతున్నారని, రాష్ట్రం తిరోగమ నం దిశలో పయనిస్తోందని విమర్శించారు. ఎల్నినో పేరు చెప్పి చేతులు దులుపుకొంటున్నారని, ప్రతిపక్షం గా ప్రభుత్వాన్ని నిలదీస్తే సహించలేక పోతున్నారని అన్నారు.

# నెల రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదికోసారి ఆడిట్లు నిర్వహించాలనీ, ఆడిట్లో గుర్తించిన లోపాలను నివేదికలకే పరిమితం చేయకుండా నిర్దిష్ట టైమ్బాండ్తో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.**సమగ్ర గైడ్లైన్స్, చెక్లిస్ట్తో జీవో**ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి అన్ని అంశాలను కవర్ చేసేలా సమగ్ర గైడ్లైన్స్, స్టాండర్డ్ చెక్లిస్ట్తో ప్రత్యేక జీవో జారీకి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఫైర్ అలారం, ఫైర్ ఎక్స్టింగ్విషర్స్, హైడ్రెంట్స్, స్ప్రింక్లర్ సిస్టమ్, ఫైర్ వాటర్ లైన్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్, ఎమర్జెన్సీ లైటింగ్, ఎలక్ట్రికల్ ప్యానెల్స్, వైరింగ్, డీజీ సెట్లు, ఏసీ యూనిట్లు, ఆక్సిజన్ సప్లై వ్యవస్థలు తదితర అంశాలతో పాటు ఎమర్జెన్సీ రెస్పాన్స్, ఎవాక్యుయేషన్ ప్రోటోకాల్స్ను కూడా చెక్లిస్ట్లో చేర్చాలని సూచించారు. ప్రతి ఆస్పత్రిని కూడా సెన్సిటివ్, నాన్-సెన్సిటివ్ జోన్లుగా విభజించాలనీ, సెన్సిటీవ్ జోన్లలో ప్రత్యేక భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి సిబ్బందికి క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

# 22ఏ భూముల వ్యవహారంపై కొత్త కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన అంశాలను పరిశీలించే సమయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా కమిటీలో భాగస్వాములుగా వ్యవహరించనున్నారు. **పలు అంశాలపై సమగ్ర విచారణ**కమిటీ కేవలం 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ భూములు, మిగులు భూములు, అసైన్డ్ భూములు, జాగీర్, భూదాన్, ఇనాం, అటవీ భూములు, భూసేకరణ, పునరావాసం, నీటి వనరులు, వాటి పరీవాహక ప్రాంతాలు, భూ రికార్డులకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించనుంది. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారిక ఆదేశాల ఉల్లంఘనలు జరిగాయా అనే అంశాన్ని పరిశీలించి బాధ్యతను నిర్ధారించడంతో పాటు అవసరమైన చర్యలను ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. విచారణకు అవసరమైన పత్రాలు, రికార్డులు, సమాచారాన్ని ఏ ప్రభుత్వ శాఖ నుంచైనా, జిల్లా కలెక్టర్ల నుంచి, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఆధీనంలోని ఇతర సంస్థల నుంచి కోరే అధికారం కమిటీకి ప్రభుత్వం కల్పించింది. అవసరాన్ని బట్టి నిర్దిష్ట అంశాలపై మధ్యంతర నివేదికలను కూడా సమర్పించవచ్చు. తుది నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందించాలని ఆదేశించింది. **పలు జిల్లాల్లోని భూములపై దృష్టి** ప్రభుత్వ ఉత్తర్వుల్లో వివిధ జిల్లాల్లోని పలు భూ వ్యవహారాలను పరిశీలనకు చేర్చినట్లు నివేదికలు వెల్లడించాయి. సిద్దిపేట, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్నగర్, హైదరాబాద్ తదితర జిల్లాల్లోని భూములకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. ఇందులో మాజీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, అనుబంధ వ్యక్తులు లేదా సంస్థలకు సంబంధించిన భూములపై వచ్చిన ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవి విచారణలో పరిశీలించాల్సిన ఆరోపణలు మాత్రమేనని, కమిటీ తుది నిర్ధారణ చేయాల్సి ఉంది.**గతంలో మరో కమిటీ ఏర్పాటు** ఇదిలా ఉండగా, 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సెప్టెంబర్ 18న మరో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీకి భూపరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేశ్కుమార్ అధ్యక్షుడిగా, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖ ఉన్నతాధికారి రాజీవ్గాంధీ హనుమంతు సభ్యులుగా నియమితులయ్యారు. 22ఏకు సంబంధం చిన 12 రకాల సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాలను సూచించడం ఆ కమిటీ ప్రధాన ఉద్దేశం. తాజాగా ఏర్పాటు చేసిన కమిటీ మాత్రం 22ఏ అంశం తో పాటు పలు రకాల భూ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలను పరిశీలించనుంది. దీంతో రాష్ట్రంలో భూములకు సంబంధించిన వివాదాలు, నిషేధిత జాబితా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ రికార్డుల అంశాలపై ప్రభుత్వం విస్తృతంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# ఆయిల్పామ్ రైతులకు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

సాగు వైపు ప్రోత్సహిస్తూ.. మరో వైపు విదేశీ పామాయిల్ దిగుమతులకు అనుకూలంగా సుంకాన్ని తగ్గించడం ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. క్రూడ్ పామాయిల్ పై మొత్తం దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించడం వల్ల విదేశీ పామాయిల్ కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్పామ్ గెలల ధరలపై ఒత్తిడి పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయమన్నారు. ఆయిల్ పామ్ సాధారణ సీజనల్ పంట కాదని, రైతులు ఏళ్లపాటు పెట్టుబడులు పెట్టి సాగు చేసే దీర్ఘకాలిక పంట అని తుమ్మల తెలిపారు. మొక్కలు నాటిన వెంటనే ఆదాయం రాదని, నీరు,ఎరువులు,నిర్వహణపై నిరంతరం ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు.ఇలాంటి పంటకు మార్కెట్, ధరల విషయంలో విధాన పరమైన స్థిరత్వం అవసరమన్నారు. దిగుమతి విధానాల్లో తరచూ మార్పులు చేస్తే రైతుల్లో నమ్మకం దెబ్బ తింటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకు పైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని చెప్పారు. పెట్టుబడి రాయితీలు, మొక్కల విస్తరణ,డ్రిప్ ఇరిగేషన్, మౌలిక వసతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కేంద్రం కూడా ఎన్ఎంఇఓఓపి పథకం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఒక వైపు సాగు విస్తరణకు లక్ష్యాలు నిర్దేశిస్తూ, మరో వైపు దిగుమతులను ప్రోత్సహించే విధానాలు తీసుకోవడం వల్ల రైతుల్లో నమ్మకం దెబ్బ తింటుందని అన్నారు. తాజా ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర కల్పించాలన్నది రాష్ట్ర రైతుల దీర్ఘకాలిక డిమాండ్ అని తుమ్మల తెలిపారు.



# సింగరేణిలో రూ.1600 కోట్ల బొగ్గు కుంభకోణం

**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని, అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తీవ్ర స్థాయిలో మండిపడింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితర నేతలు గురువారం సింగరేణి సీఎండీకి వినతి పత్రం సమర్పించారు. గతంలో 70 మిలియన్ టన్నులున్న ఉత్పత్తి ఇప్పుడు 58కి పడిపోవడం, థర్మల్ ప్లాంట్ కు నాసిరకం బొగ్గు సరఫరా చేస్తూ పొరుగు రాష్ట్రాలకు మేలైన బొగ్గును అమ్ము కోవడం వల్లే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం తలెత్తిందని వారు ఆరోపించారు. సంస్థలో ఏకంగా రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయం కావడంపై సీఏజీతో సమగ్ర విచారణ జరిపించాలని, రాష్ట్ర ప్లాంట్లకు తక్షణమే నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.

# వెల్కమ్...కామ్రేడ్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘనస్వాగతం పలికారు. మూడు సంవత్సరాల తర్వాత అమెరికాలో జిన్పింగ్ జరుపుతున్న తొలి పర్యటన పెద్ద పురోగతిని అందిస్తుందన్న అంచనాలు లేకపోయినప్పటికీ ఇరు దేశాల మధ్య 11 నెలలుగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పందాన్ని పొడిగించేందుకు అంగీకారం కుదిరింది. నవంబరులో ఈ ఒప్పందం కాలపరిమితి ముగియాల్సి ఉండగా వచ్చే సంవత్సరం జనవరి 10వ తేదీ వరకూ దీనిని పొడిగించాలని అంగీకారానికి వచ్చామని అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. చైనా ఉప ప్రధాని హే లిఫెంగ్తో బెస్సెంట్ జరిపిన తాజా చర్చల అనంతరం ఒప్పందం పొడిగింపుపై అంగీకారం కుదిరింది.

# జ్ఞానేష్ కుమార్ దేశద్రోహి రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై ప్రతిపక్షాలు తమ విమర్శలను తీవ్ర తరం చేశాయి. తాజాగా బీజేపీ, చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ లపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఓట్లను దొంగిలిస్తున్నారని, దీనివల్ల ఎంపీలు చేసిన చట్టాలు చట్టవిరుద్ధం అవుతాయని ఆయన అన్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో గాంధీ మాట్లాడుతూ..కుమార్ను దేశద్రోహిగా అభివర్ణించారు.

ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం "నాశనం అవుతుంటే" కాంగ్రెస్ మౌనంగా చూస్తూ ఉండదని హెచ్చరించారు.

# దానం నాగేందర్కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తరఫున కొనసాగుతున్న అంశం ఈ వ్యవహారంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. పార్టీ మార్పు నేపథ్యంలో దానం నాగేందర్ అనర్హతకు సంబంధించిన పిటిషన్పై హైకోర్టు గతంలో విచారణ జరిపి తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఈ పిటిషన్పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు కారణాలు లేవని పేర్కొంటూ పిటిషన్ను కొట్టివేసినట్లు సమాచారం.

ఒక పార్టీ గుర్తుపై ఎన్నికల్లో గెలిచి అనంతరం మరో పార్టీకి మారడం, దానికి సంబంధించిన అనర్హత నిబంధనలు చట్టసభ సభ్యులకు వర్తిస్తాయని కోర్టు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.చట్టసభ సభ్యుల పార్టీ మార్పులకు సంబంధించిన అంశాల్లో రాజ్యాంగంలోని పదో షెడ్యూల్, అనర్హత నిబంధనలు కీలకంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ వ్యవహారంపై వెలువడిన సుప్రీంకోర్టు నిర్ణయం రాజకీయ, న్యాయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

# నీటి సంపుల్లో పడి ఇద్దరు బాలుర మృతి

(మొదటి పేజీ తరువాయి)

శివారులో నీటి సంపులో పడిన మేకను రక్షించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. బంధువులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా,

అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

# జూరాలకు కృష్ణా జలాలు

(మొదటి పేజీ తరువాయి)

జలాలను జాగ్రత్తగా వినియోగిస్తే పంటలు, తాగునీటి అవసరాలను తీర్చవచ్చన్నారు. డిస్ట్రిబ్యూటరీల వారీగా సమానంగా నీటిని విడుదల చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. లష్కర్లు, ఇతర సిబ్బందిని వినియోగించి ఆన్-ఆఫ్ పద్ధతిలో క్రమబద్ధంగా నీటి సరఫరా చేయాలని సూచించారు. రైతులకు ముందుగానే వారాబందీపై సమాచారం అందించాలని కలెక్టర్ను ఆదేశించారు. నవంబర్ 27 వరకు ఈ విధానంలో నీటిని విడుదల చేస్తే వానాకాలం పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.**కర్ణాటక సీఎంకు ధన్యవాదాలు** కర్ణాటక సీఎం డీకే శివకుమార్తో సీఎం రేవంత్రెడ్డి చర్చించిన అనంతరం ఎమ్మెల్యేల బృందం కర్ణాటకకు వెళ్లి నీటి విడుదలపై చర్చించిందని జూపల్లి తెలిపారు. అనంతరం జూరాలకు కృష్ణా జలాలు విడుదల చేయించినందుకు కర్ణాటక సీఎంకు జిల్లా రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా అందుబాటులో ఉన్న నీటిని అత్యవసర ప్రాంతాలకు వినియోగించాలని మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు సూచించారు. కోయిల్సాగర్ నింపేందుకు రెండు మోటార్లు వెంటనే ఆన్ చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది.ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు.దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు.ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుందని చెప్పారు. ప్రజా తీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాల రాస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని తెలిపారు.దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి అనర్హత కారణంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని అన్నారు.

# జర్నలిస్టులకు అండగా నిలబడే దమ్మున్న యూనియన్ టిజెఎఫ్‌దే

**వచ్చే నెల మొదటి వారంలో**

**ఖమ్మం డివిజన్ మహాసభలు**

**టీజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి**



**ఖమ్మం, ప్రతినిధి సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా టీజెఎఫ్ అండగా ఉంటుందని, జర్నలిస్టుల కోసం నిలబడి కలబడే దమ్మున్న జర్నలిస్ట్ యూనియన్ టీజెఎఫ్ దే అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) నగర కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెస్ క్లబ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చిర్రా రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన చరిత్ర తమ యూనియన్ దేనని , కష్టాల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం రాజీ లేని పోరాటాలు చేసిన ఘనత తమదే అన్నారు. వచ్చే నెల మొదటి వారంలో టి జె ఎఫ్ ఖమ్మం డివిజన్ మహాసభలు ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఈ సభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టు మిత్రులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ యూనియన్ నుంచి వి5 బ్యూరో ఇన్చార్జ్ కెవి, విజన్ ఆంధ్ర బ్యూరో ఇన్చార్జ్ రామకృష్ణ,అశోక్, నాగేశ్వరరావు తదితరులు టీజేఎఫ్ యూనియన్ లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందులు ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు నాగరాజు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు య లమందల జగదీష్, కరీష అశోక్,ఫోటోగ్రాఫర్ రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు,కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, పులి శ్రీను,రేపాక యాదగిరి, హుస్సేన్, సహాయ కార్యదర్శులు బోనగిరి యాదగిరి ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్, మీడియా ఇన్చార్జ్ తిరుపతిరావు, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి, రోజా, మాధవి, కిరణ్మయి, శ్రీదేవి, నాగలక్ష్మి, సీనియర్ నాయకులు ఉత్కంఠం శ్రీను, సాయి కళ్యాణ్, ఎన్ టి వి సాయి, గౌరీ శంకర్, గోవింద్, నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, రవి,లింగయ్య, నరసింహా రావు, భద్రం, రాంబాబు, లక్ష్మణ్, వెంకన్న, నాగరాజు, కూరపాటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.




# మల్లంపల్లిలో పందుల మృతిపై పశువైద్య అధికారుల పరిశీలన

- మృతిచెందిన పందులకు పోస్టుమార్టం
- నమూనాలు సేకరించి హైదరాబాద్‌కు పంపిన అధికారులు
- ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యుల వెల్లడి
- పశువైద్య అధికారి డాక్టర్ వడ్డేపల్లి రమేష్



**జెడి మల్లంపల్లి సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** జెడీ మల్లంపల్లి గ్రామానికి చెందిన గంట చిన్నకు చెందిన పందులు మృతి చెందుతున్నట్లు సమాచారం అందడంతో సెప్టెంబర్ 23న స్థానిక పశువైద్య అధికారి డాక్టర్ వడ్డేపల్లి రమేష్,వరంగల్ జిల్లా అనిమల్ డిసీజ్ డయాగ్నస్టిక్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో కలిసి మృతిచెందిన పందులను పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి,పందుల నుంచి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. ప్రస్తుతం అనుమానిస్తున్న వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ముందుజాగ్రత్తగా పందుల పాకను క్రిమిసంహారక మందులతో స్ప్రే చేయాలని గంట చిన్నకు సూచించారు. అనారోగ్యంగా ఉన్న పందులను మిగతా వాటి నుంచి వేరుచేసి,ఇమ్యూనిటీ బూస్టర్‌లు వినియోగించాలని సూచించారు. అలాగే ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇతర పందుల పెంపకందారుల పందులకు వ్యాక్సినేషన్ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో సేవా యువజన సంఘం గణనాథుని నిమజ్జన ఊరేగింపు



**ములుగు జిల్లా ఏటూరునాగారం, సెప్టెంబర్24(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథునికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, గురువారం స్వామివారి నిమజ్జన ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గంగమ్మ గుడి వద్దకు తీసుకెళ్లారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సేవా యువజన సంఘం సభ్యులు, మహిళలు, పిల్లలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపులో మహిళలు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌తో ఉత్సాహంగా పాల్గొనగా, చిన్నారులు సైతం ఎంతో ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ముఖ్యంగా భరతనాట్య ప్రదర్శనలు, చిన్నారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గణనాథుని దర్శించుకునేందుకు మార్గమధ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సేవా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించామని, భక్తుల సహకారంతో నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేష్ మహారాజ్! అంటూ భక్తుల నినాదాలతో ఏటూరునాగారం పురవీధులు మార్మోగాయి.

# కమలాపూర్‌లో బొజ్జ గణపయ్య నిమజ్జనం...

**రెండో రోజు కొనసాగిన**

**వినాయకుని నిమజ్జనం**

**కన్నూర్ కొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో**

**గణేశుని నిమజ్జనం...**





**కమలాపూర్ సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో నీ అన్ని గ్రామాలలో బొజ్జ గణపయ్య నిమజ్జనం ఘనంగా జరిగింది. నవరాత్రులు కొలువుదీరిన గణపయ్య గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రెండో రోజు నేడు శోభయాత్ర ముగించుకొని నిమజ్జనం చేశారు. కన్నూర్ గ్రామంలో యువకులు ప్రజలు మహిళలు భక్తిశ్రద్ధలతో గణపయ్యను తలుచుకుంటూ కోలాట బృందం నృత్య ప్రదర్శన చేస్తూ బొజ్జ గణపయ్యను సాగనంపారు. గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని ప్రజలందరూ సుఖశాంతులతో జీవితం కొనసాగిస్తూ అభివృద్ధి చెందాలని గణనాథుడు ఆశీర్వాదం తీసుకొని గణేశుని నిమజ్జనం చేశారు. కొత్తపల్లి గ్రామంలో కమలాపూర్ మండల సిపిఐ సహాయ కార్యదర్శి గోల్లే మహేందర్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి కోలాట బృందం ప్రదర్శిస్తూ భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలను ఉత్సాహపరుస్తూ బొజ్జ గణపయ్యను సాగనంపారు. ఈ గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మండలంలోని ప్రజా ప్రతినిధుల అందరి సహకారంతో కమలాపూర్ మండల సిబ్బంది పోలీస్ శాఖ గ్రామపంచాయతీ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది విద్యుత్ సిబ్బంది అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పర్యవేక్షిస్తూ గణపయ్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి విజయవంతం చేశారు.

# హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్ గోకుల్‌పై చర్యలు తీసుకోవాలి

**- శాట్స్ ఎండీకి కయాకింగ్ అండ్ కెనోయింగ్ అసోసియేషన్ ఫిర్యాదు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, హైదరాబాద్ జిల్లా యువజన క్రీడల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏ.ఎన్.కె. గోకుల్ అమానుష వైఖరి, పరిపాలనా లోపాలు మరియు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ కయాకింగ్ & కెనోయింగ్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) మేనేజింగ్ డైరెక్టర్ సోని బాల దేవిని గురువారం కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ హైదరాబాద్ , కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ... గతంలో కూడా క్రీడా పరిపాలనకు సంబంధించి గోకుల్‌పై సస్పెన్షన్, క్రమశిక్షణా చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ టోర్నమెంట్‌లో ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు, వివాదాస్పద తీర్పులతో పాటు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పరిపాలనా బాధ్యతలపై కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నట్లు గుర్తుచేశారు. తాజాగా సెప్టెంబర్ 18న జరిగిన 8వ 'ఖేలో ఇండియా' సెలెక్షన్స్‌లో కయాకింగ్, కెనోయింగ్ కోచ్‌ల పట్ల ఆయన అత్యంత దూకుడుగా, దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యుల సమక్షంలోనే అసభ్యకర, అభ్యంతరకర పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఒకటి, రెండు ఎడిషన్ల 'సీఎం కప్' పోటీల్లో కూడా వాటర్ స్పోర్ట్స్ క్రీడలకు సరైన ఏర్పాట్లు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సాధారణ శిక్షణ సమయంలో అడ్డంకులు సృష్టించడమే కాకుండా, తెలంగాణ పోలీస్ జట్టు శిక్షణకు సైతం అవసరమైన సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. హైదరాబాద్ డీవైఎస్ఓ, ట్యాంక్‌బండ్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, రెజ్లింగ్ ఇన్‌ఛార్జ్‌గా ఒకే అధికారికి మూడు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్రీడాకారులు, కోచ్‌ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయనపై నిష్పాక్షిక విచారణ జరిపి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, ఆ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి అర్హులైన ఇతర అధికారులకు అప్పగించాలని అసోసియేషన్ తరపున శాట్స్ ఎండీని ఆయన కోరారు.

## చైనాలో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నీకి

# హనుమకొండ బాలిక ఎంపిక




**హనుమకొండ, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండకు చెందిన యువ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి వేల్పుల సాయి వర్షిణి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. చైనాలోని వూషి నగరంలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఆమె పాల్గొననుంది. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై హనుమకొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకు రావడానికి సాయి వర్షిణి సిద్ధమవుతోంది. హనుమకొండలోని గ్రీన్‌వుడ్ హై స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న సాయి వర్షిణి గత నాలుగేళ్లుగా జవ హర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కోచ్ పాలెపాక వినయ్ కుమార్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ పొందు తోంది. ఇప్పటికే వరంగల్, మెదక్, నిజామాబాద్‌లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబ రిచింది. ఔరంగాబాద్‌లో జరిగిన అండర్-15 బాలికల జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లోనూ పాల్గొంది. అనంతరం 5వ ఆసియా కప్-2026 ఎంపిక ట్రయల్స్‌లో సాయి వర్షిణి పాల్గొంది. మహారాష్ట్రలోని కోపర్‌గావ్‌లో ఉన్న సంజీవని యూనివర్సిటీలో జూలై 24, 25 తేదీల్లో నిర్వహించిన ఎంపిక ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

**అంతర్జాతీయ పోటీకి ముందు శిక్షణ శిబిరాలు** ఆసియా కప్‌కు సన్నాహకంగా సాయి వర్షిణి పలు శిక్షణ శిబిరాల్లో పాల్గొంటోంది. ఆగస్టు 24 నుంచి 26 వరకు ఇండోర్‌లోని చావన్ గ్రౌండ్‌లో, సెప్టెంబర్ 8 నుంచి 13 వరకు మహారాష్ట్రలోని కోపర్‌గావ్ సంజీవని యూనివర్సిటీలో శిక్షణ శిబిరాల్లో పాల్గొంది. అక్టోబర్ 6 నుంచి 10 వరకు పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లా కల్యాణిలో ఫైనల్ క్యాంప్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 12 నుంచి 18 వరకు చైనాలోని వూషి నగరంలో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నీలో సాయి వర్షిణి బరిలోకి దిగనుంది. సాయి వర్షిణి ప్రతిభను గుర్తించి ప్రోత్సహి స్తున్న తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డా. పిల్లి సాంబశివరావు, హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి టాబేటి రాజేందర్, ఉపా ధ్యక్షుడు పెరు మాండ్ల సాంబమూర్తికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చిన్న వయసులోనే అం తర్జాతీయ స్థాయికి ఎంపికైన సాయి వర్షిణి భవిష్య త్తులో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి మరిన్ని వి జయాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# మహబూబాబాద్ జిల్లా కేజీబీవీలలో కలకలం...?

### స్పెషల్ ఆఫీసర్ల టర్మినేషన్ వెనుక అంతర్యం ఏమిటి...?

### మాముళ్ళ కోసమే అని అరోపణలు..?

**మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24:(పిసిడబ్లూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో ప్రక్షాళన పేరుతో కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. జిల్లాలో నూతనంగా జిసిఇఓగా బాధ్యతలు స్వీకరించిన అధికారి వచ్చిన నాటి నుండి స్పెషల్ ఆఫీసర్ల (SO) పై వరుస చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే గార్ల మండల కేజిబివీ స్పెషల్ అఫీసర్ ను టర్మినేట్ చేయగా, తాజాగా కురవి మండలం నేరడ గ్రామంలో నిర్వహిస్తున్న కెజిబివీ స్పెషల్ ఆఫీసర్ ను కూడా టర్మినేషన్ చేశారు. అంతేకాకుండా డోర్నకల్ కెజిబివీ స్పెషల్ అఫీసర్ కు షోకాజ్ నోటీసు జారీ చేశారని. కావాలనే కొద్దిమందిపై కక్ష కట్టి ఇలా చేస్తున్నారని పలువురు స్పెషల్ అఫీసర్లు ఆరోపిస్తున్నారు. గత 16 సంవత్సరాలుగా ఉద్యోగంలో కొనసాగుతున్న వారిని, ఇప్పుడు అర్ధరహితమైన ఆరోపణలతో తొలగించడం విచారకరమని, కెజిబివీ లపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా ఇలా టర్మినేషన్ చేయడం సరైన విధానం కాదని పలువురు పేర్కొంటున్నారు.

**గతంలో తొలగింపుకు గురైనవారే ఇప్పుడు జిసిఇఓగా...!**



ప్రస్తుతం జిసిఇఓ గా ఉన్నవారే గతంలో నేరడ కెజీబీవీ లో స్పెషల్ అఫీసర్ గా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహించారని, ఆ సమయంలో నిధుల దుర్వినియోగం, పిల్లలకు కేటాయించిన పాలు, కూరగాయలు, పప్పు దినుసులు ఇంటికి తీసుకెళ్లేవారనే ఆరోపణలు రావడంతో అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి వారిని విధుల నుండి తొలగించారు. అంతేకాకుండా బయ్యారం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులకు సరిగా హాజరు కాకుండా ఎగనామం పెట్టేవారని కూడా ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వ్యక్తే ఇప్పుడు జిసిఇఓ గా వచ్చి స్పెషల్ అఫీసర్లను టర్మినేషన్‌లో కీలక పాత్ర పోషించడం శోచనీయమని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.

**కొత్తూరు(సి)లో స్కూల్ అసిస్టెంట్ గా పని చేసినప్పుడు కూడా అవే చిల్లర చేష్టలు....?**

కురవి మండలం కొత్తూరు(సి) ప్రాధమిక ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించేటప్పుడు ఆ గ్రామ పాఠశాలలో చదివే విధ్యార్ధులతో ప్రతి రోజు వారి ఇంటి వద్ద నుండి కూరగాయలు. పప్పు దినుసులు తెప్పించుకునేదని దాంతో విద్యార్థుల తల్లి దండ్రులు పాఠశాల కు వచ్చి అమెపై అగ్రహం వ్యక్తం చేస్తూ. గట్టిగా మందలించారనే అరోపణలు ఉన్నాయి.

**భర్తతో తనిఖీలు, ఫోన్ ద్వారా బెదిరింపులు...!**

తనిఖీల పేరుతో భర్తను వెంట తీసుకెళ్లి స్పెషల్ అఫీసర్లను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని, తనిఖీల అనంతరం భర్త స్వయంగా స్పెషల్ అఫీసర్లకు ఫోన్ చేసి " నేను 30 ఏళ్లుగా జర్నలిస్టుగా పనిచేస్తున్నాను, నాకు అన్నీ తెలుసు, మీ విషయాలు నేను చూసుకుంటాను" అంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తనిఖీల పోరుతో అమె వెంట జిల్లా హెడ్ క్వాటర్ లో ఉండే విలేకరులను.భర్తను తీసుకొని పోవడం వెనుక అంతర్యం ఎమిటోనని పలువురు చర్చించుకుంటున్నారు.అధే విధంగా గార్ల మరియు నేరడ కేజిబివీ స్పెషల్ అఫీసర్ల టర్మినేషన్ ను వెంటనే ఎత్తివేసి, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల అధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు...

---

## చిగురుమామిడి ఆదర్శ పాఠశాల,కళాశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' అవగాహన ప్రోగ్రాం....

**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిగురుమామిడి ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అర్జిత్ కౌర్ అధ్యక్షతనఈ కార్యక్రమంలో , మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ సుందరగిరి సాయికిరణ్ గౌడ్ పోషణ్ అభియాన్ సిబ్బంది రోమిలా, ప్రణీత మరియు మహిళా సాధికారత కేంద్రం నుండి జెండర్ స్పెషలిస్ట్ కవిత పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.డ్రగ్స్ , మత్తు పదార్థాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబంపై, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి వివరంగా వివరించారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా పూర్తిగా దూరంగా ఉండాలని



సూచించారు.సోషల్ మీడియాను అత్యంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా ఇతర సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని తెలిపారు.సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకులు మరియు వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను సులభంగా నమ్మవద్దని, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.మొత్తంగా, విద్యార్థులు డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పూర్తి ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రి పొన్నం సమీక్ష



**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్లపై జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, రాకపోకల నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పర్యటనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, నూతన కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణాన్ని మంత్రి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ గది సహా ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం నూతన కలెక్టరేట్‌లో అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

---

## కరీంనగర్ టవర్ సర్కిల్‌లో వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు..


### - వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం..

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిమజ్జన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని ప్రసిద్ధ టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకలు కార్యక్రమం ఘనంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కొలువైన గణనాథుల ప్రతిమలు భారీ శోభాయాత్రల మధ్య టవర్ సర్కిల్ వద్ద ఆయా వినాయకులు పూజలు అందుకుని నిమజ్జనానికి




తరలి వెళ్లే వేడుకల్లో సాయిని మల్లేశం పాల్గొని మాట్లాడారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు సమాజంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చి, హిందూ ఐక్యతను చాటుతాయన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని కడసారి దర్శించుకోవడం, మన సనాతన సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని తెలిపారు. భక్తులు యువజన సంఘాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు కరీంనగర్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు. టవర్ సర్కిల్ ప్రాంతం "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మార్మోగింది.

## పోలీసుల పనితీరుకు హర్షం వ్యక్తం చేసిన వాహనదారులు




**తొర్రూరు ప్రతినిధి ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** వాతావరణ శాఖ తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాలలో భారీ వర్ష సూచన అని తెలపడం జరిగింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని పాఠశాలలకు గురువారం సెలవు దినాన్ని ప్రకటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో పాటు పెనుగాలలు విస్తున్నాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తొర్రూర్ మండలంలోని గుర్తుర్ గ్రామంలో గ్రామపంచాయతీకి దగ్గరలో ఉన్న రాజేష్ అనే వారి ఇంటి ముందు భారీ వృక్షం విరిగి రేకుల షెడ్డు పై పడింది. రాత్రి సమయం కావటంతో ఎవరికి కూడా ఏమి హాని జరగలేదు. తొర్రూరు నుండి నర్సంపేట వెళ్లే రహదారిలో అన్నారం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు ఈదురు గాలులకు ఎప్పుడు నే లమట్టం అవుతాయో తెలియకుండా ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం విద్యుత్ తీగల కిందనే భారీ వృక్షాలను నాటకం వలన ఏపుగా పెరిగిన వృక్షాలను విద్యుత్ అధికారులు తీగలకు వృక్షాలు తగలకుండా ఒక పక్కకు నరికి వేయటంతో ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందని వాహనదారులు అలాగే ద్విచక్ర పై వెళ్లేవారు కూడా భయభ్రాంతులకు గురవుతూనే ఉన్నారు. తొర్రూర్ నుండి అన్నారం వెళ్లే మార్గమధ్యలో దుర్గమ్మ గుడి సమీపంలో రహదారిపై చెట్టు గురువారం రాత్రి సుమారు 8:30 ప్రాంతంలో చెట్టు కూలిపోయింది. విషయం తెలుసుకున్న తొర్రూర్ ఎస్సై కే మహేందర్ రెడ్డి వారి సిబ్బందితో కలిసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. రాత్రి సమయం కావటంతో చెట్టు పూర్తిగా రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు తీసుకున్న నిర్ణయానికి పోలీసుల పని తీరు పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

---

## గులాం అహ్మాద్ హుస్సేన్ సేవలు అభినందనీయం

### రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, సిపి ప్రశంసలు

**కరీంనగర్, సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** మానవత్వమే అభిమతంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా..మతసామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ కరీంనగర్ నగర వేదికగా, హిందూ-ముస్లిం భాయి భాయి అనే నినాదంతో జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2005 నుండి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు.. సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తన స్వంత ఖర్చుతో హిందూ ముస్లిం సోదర భావాన్ని పెంపొందించేందుకు, మానవత్వపు పునాదిగా అద్భుతమైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడని, రాష్ట్ర రవాణా బిసిసంక్షేమశాఖ మంత్రిపొన్నంప్రభాకర్ అన్నారు.



మంత్రిపొన్నంప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లిసత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, గంగులకమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి బుధవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా, నగరంలోని రాజీవ్ చౌక్ లో బాదం మిల్క్, మినిరల్ వాటర్, లస్సీ, రూ అబ్జా, గులాబ్ వాటర్ స్టాల్‌ను సందర్శించారు.ఆర్డీవో షర్మిల, ఏసీపీలు, సిఐలు, హిందూ ఉత్సవ సమితి చైర్మన్ కుందారపు మహేశ్వర్, నాయకులు పూట్కూరి రాధాకృష్ణ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈస్టాల్స్ సందర్శనకు వచ్చిన మంత్రికి, ఎమ్మెల్యేలకు, కలెక్టర్కు, సీపీకి.. గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆసరా పింఛన్లు అప్లికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం



**రామడుగు,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆసరా వికలాంగుల ,వితంతువు,చేనేత,గౌడ్ కార్మికుల పెన్షన్ లు ఆన్లైన్ వెరిఫికేషన్ చేయడం మొదలు పెట్టి చేయడం జరుగుతుంది. అర్హులైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేయడం జరుగుతుంది ఇట్టి కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి MPO శ్రవణ్ కుమార్ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చెట్లు ప్రగతికి మెట్లు.. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి..



**గోపాల్‌రావుపేట, సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్టీపుల్ డిస్ట్రిక్ట్ 320 పిలుపు మేరకు లయన్స్ క్లబ్ గోపాల్‌రావుపేట ఆధ్వర్యంలో గురువారం గోపాల్‌రావుపేట మార్కెట్ యార్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మార్కెట్ యార్డు పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మైక్రో క్యాబినెట్ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, కర్ర శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. "చెట్లు ప్రగతికి మెట్లు" అని పేర్కొన్నారు. చెట్లు మనకు నీడను, పండ్లను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చెట్లు ఆక్సిజన్‌ను అందిస్తూ, కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ పాకాల మోహన్, కోశాధికారి మూల అనంతరెడ్డి, మైక్రో క్యాబినెట్ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, కర్ర శ్యాం సుందర్ రెడ్డి, డైరెక్టర్లు ముదుగంటి రాజిరెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, మార్కెట్ యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర హెచ్చరిక చేస్తున్న గ్రామ సర్పంచ్**






**తొర్రూరు ప్రతినిధి ,సెప్టెంబర్ 24(పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుతరు గ్రామంలో రెండు రోజులుగా పడుతున్న భారీ వర్షాలు కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ వి కవిత పేర్కొన్నారు. మండల రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు రాబోయే రెండు రోజుల పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గుర్తూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నా మనీ అన్నారు. గ్రామంలోశిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండకూడదు హెచ్చరిస్తున్నారు. ఎవరికైనా ఇబ్బంది కలిగినట్లయితే అత్యవసర పరిస్థితులు గ్రామంలోని మోడల్ స్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయబడుతుంది అన్నారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లకూడదు. విద్యుత్ స్తంభాలను తాకకూడదు, వాటి వద్దకు వెళ్లరాదు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే గ్రామ సర్పంచ్ కి సమాచారం ఇవ్వాలి అని కోరారు. అత్యవసర కొరకు సంప్రదింపు నంబర్లు:9440048941, 9966663150ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, గ్రామపంచాయతీ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

# 27న రాచమళ్ల పుస్తకాల ఆవిష్కరణ



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రముఖ సాహితీ సంస్థ "అక్షరాల తోవ" ఆధ్వర్యంలోప్రముఖ కథా రచయిత రాచమళ్ళ ఉపేందర్ రచించిన "ఉడికిన మెతుకు" (కథల సంపుటి), "అక్షరానుభూతి" (సమీక్షల సంకలనం) రెండు పుస్తకాలు అవిష్కరించనున్నట్లు సంస్థ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జెడ్పీ మీటింగ్ హాల్ లో సాయంత్రం 6గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఖమ్మంలోని ప్రముఖ సాహితీవేత్తలు హాజరు కానున్నారు. కవులు, రచయితలు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని వారు కోరారు.

# 'ఎస్ఐఆర్' పేరుతో ఓట్ల తొలగింపు

**● ఈసీ బీజేపీకి తొత్తుగా మారింది.? ● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఫైర్ ● ఎన్నికల కమిషన్ తీరుపై ఘాటు విమర్శలు ● జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఘాటుగా విమర్శించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడారు. ఈసీ తాజాగా సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్ పూర్తిగా అసమంజసంగా ఉందన్నారు. "అనుమానాలను స్వీకరించం, ఆ అంశాన్ని కమిషన్ పరిశీలిస్తుంది అని క్యాబినెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని సమాధానం చెప్పడం సిగ్గుచేటన్నారు. 10 ఏళ్లలో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇలా చట్టవిరుద్ధంగా చర్యలు చేపట్టారని వారిలో ఆరోపించారు. 2025 జూన్ నుండి ఇప్పటిదాకా సర్ లో భాగంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించారు. ఇది ఓట్ల తొలగింపు కాదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని ఆయన మండిపడ్డారు. ఈసీ తీరుపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోందని, అందుకే ఢిల్లీలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నిరసన తెలిపారని గుర్తుచేశారు. "బీజేపీ, ఆరెస్సెస్, ఈసీలు కలిసి ఓట్ల చోరీ ద్వారా దేశద్రోహ చర్యకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో నిరసనలు చిన ఆసాంతం ఎన్నికలను రద్దు చేసి మళ్ళీ బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు నిర్వహించాలి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి, ఆయనను అరెస్టు చేయాలి. గతేదాది కాలంలో ఈ నిర్ణయాలను పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకోలేదు, కేవలం కొందరు అధికారుల ఇష్టానుసారంగా జరుగుతోంది" అని ఆయన ఆరోపించారు. కొత్త ఓటరు అంటే ఎవరో తెలియదని, తల్లిదండ్రులు, తాతల పేర్లను నింపడానికి తీసుకొచ్చిన పారంఫారం మార్పులు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చట్టాల్లో మార్పులు చేయకుండా ఫారం -6 ను మార్చలేరని అన్నారు. ఈసీ తీరు బ్రిటిష్ పాలనను తలపిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ వీధి పోరాటం చేస్తుందని, దేశ ప్రజలు బీజెపి పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. ఈ పోరాటం ఆగదని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ స్పష్టం చేశారు.

# కార్పెంటర్ల ఐక్యతకు 'యాక్షన్ టెస్సా' భరోసా

**● శ్రామిక హస్తాలకు రూ. 2 లక్షల ఇన్సూరెన్స్, పిల్లల పెళ్లిళ్లు, చదువులకు కొండంత అండ ● 600 మంది కార్పెంటర్లకు ఘన సన్మానం ● సంక్షేమ పథకాలతో కార్పెంటర్ల కుటుంబాలకు భరోసా**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నింగిలోని అందాలను నేలపై మలిచి, రాతికి, చెక్కకు జీవం పోసే సృజనాత్మక శిల్పులు.. మన అందమైన గృహాలకు ప్రాణం పోసే విశ్వకర్మ సోదరుల త్యాగానికి, శ్రమకు శిరస్సు వంచి నమస్కరిస్తోంది భారతదేశపు నంబర్-1 ప్యానెల్ పరిశ్రమ దిగ్గజం 'యాక్షన్ టెసా'. నైపుణ్యవంతులైన కార్పెంటర్లకు గౌరవం, వారి కుటుంబాల సంక్షేమానికి భరోసా కల్పించేలా 'యాక్షన్ టెస్సా' ఆధ్వర్యంలో 'జాతీయ కార్పెంటర్స్ దినోత్సవ వేడుకలు' ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సుమారు 600 మంది కార్పెంటర్లను ఘనంగా సన్మానించారు. 'సంఘ్ సంఘ్ చలే... ఆగే బడే' అనే ఐక్యతా నినాదాన్ని కార్పెంటర్లకు అంకితం చేస్తూ, వృత్తిపరమైన అభివృద్ధితో పాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు అండగా నిలిచే పలు సంక్షేమ కార్యక్రమాలను 'యాక్షన్ టెస్సా' ప్రకటించింది. భారతదేశంలో ప్రముఖ ప్యానెల్ పరిశ్రమ సంస్థగా ఉన్న యాక్షన్ టెస్సా, కార్పెంటర్ల సేవలను గుర్తించి వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్పెంటర్ల భద్రతకు రూ. 2 లక్షల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, వారి కుమార్తెల వివాహానికి యాక్షన్ టెస్సా బోర్డుతో తయారు చేసిన ఫర్నిచర్‌పై రూ. 50 వేల వరకు సహాయం, పిల్లల ఉన్నత విద్య కోసం రూ. 11 వేల స్కాలర్‌షిప్ అందించే పథకాలను ప్రకటించారు. అలాగే కుటుంబ సభ్యుల కోసం టెస్సా, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో నిర్వహించే మూడు నెలల నైపుణ్యాభివృద్ధి కోర్సును అందించనున్నట్లు తెలిపారు. సుమారు రూ. 50 వేల విలువైన ఈ కోర్సులో వసతి సౌకర్యంతో పాటు, కోర్సు పూర్తయిన అనంతరం ఉద్యోగావకాశం కల్పించే అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా కార్పెంటర్ల కష్టాన్ని, నైపుణ్యాన్ని గుర్తించి వారికి అండగా నిలవడం సంస్థ సామాజిక బాధ్యతలో భాగమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఒక కార్పెంటర్ చేతిలో రూపుదిద్దుకునే ప్రతి వస్తువు వెనుక అతని శ్రమతో పాటు కుటుంబం కోసం పడే తపన, భవిష్యత్తుపై ఎన్నో ఆశలు ఉంటాయని, అలాంటి శ్రమజీవుల సంక్షేమానికి చేయూత అందించడం తమ లక్ష్యమని తెలిపారు. **126 ఎకరాల్లో నూతన తయారీ యూనిట్ :** సదస్సును ఉద్దేశించి యాక్షన్ టెస్సా జనరల్ మేనేజర్ డాక్టర్ వై. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ... విశాఖపట్నం (అనకాపల్లి) సమీపంలోని రాంబిల్లిలో 126 ఎకరాల విస్తీర్ణంలో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కొత్త యూనిట్ ద్వారా సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించడంతో పాటు, పరిశ్రమ అభివృద్ధికి దోహదపడే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్పెంటర్ల నైపుణ్యం, ఐక్యత, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. తమ చేతి నైపుణ్యంతో సమాజానికి అందమైన రూపాన్ని అందిస్తున్న కార్పెంటర్లను గౌరవించడం తమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ టెస్సా వైస్ ప్రెసిడెంట్ అజయ్ కుమార్ పాండే, జనరల్ మేనేజర్ డాక్టర్ వై. జనార్దన్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ బి.ఆర్.వి. మూలారెడ్డి, సీనియర్ ఏరియా సేల్స్ మేనేజర్ డి. నాగార్జునరెడ్డి, స్థానిక మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎ. కరుణాకర్, యాక్షన్ టెస్సా ఉత్పత్తుల అధీకృత డిస్ట్రిబ్యూటర్ 'శ్రీ శ్రీనివాస ప్లైవుడ్స్' మేనేజింగ్ డైరెక్టర్ తల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్పెంటర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 'మన అంగన్‌వాడీ మన బాధ్యత'తో పోషణ మాసం విజయవంతం చేయాలి



**కడప,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించి, ప్రజల్లో పోషకాహారంపై అవగాహనతో పాటు ఆచరణాత్మక మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 'మన అంగన్‌వాడీమన బాధ్యత' ప్రధాన సందేశంతో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్రంగా చేసుకుని పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోషణ మేళాలు, పోషక వంటకాల ప్రదర్శనలు, రుచి పరీక్షలు, సామూహిక భోజన కార్యక్రమాల ద్వారా ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఆహార వైవిధ్యం, ప్రోటీన్, అంగన్‌వాడీల్లో తాజా వేడి భోజనం, సమాజ భాగస్వామ్యం, బాల్య వికాసం, ప్రధానమంత్రి మాతృ వందన యోజనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సమన్వయ సమావేశం, సామూహిక భోజన రుచి పరీక్ష, పోషక వంటకాల ప్రదర్శన, పోషణ మేళా, మాతృ వందన యోజన నమోదు శిబిరం నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని, వ్యవసాయ, ఉద్యాన శాఖల సహకారంతో అంగన్‌వాడీల్లో పోషణ తోటలను అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, విద్య, పట్టణ స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ రమాదేవి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పాల్గొన్నారు.


# సంపాదకీయం

## ఫార్మాడ్రగ్స్ మత్తులో యువత



దేశం లోని అనేక రాష్ట్రాల్లో యువత హెరాయిన్ అనే మత్తు పదార్థానికి బానిసలవుతున్నారు. మార్ఫిన్, కోడైన్, ఆక్సికోడోన్, ఫెంటానిల్, హెరాయిన్ అనేవి ఓపియాయిడ్లు. ఇవి మెదడు, నాడీ వ్యవస్థపై ప్రధానంగా నొప్పి తగ్గించడానికి వినియోగిస్తారు. వైద్యపరంగా సరైన మోతాదులో వీటిని వినియోగిస్తే నొప్పి నియంత్రణలో సహాయపడతాయి. వీటిని వ్యసనంగా చేసుకుని ఎక్కువ మోతాదులో వాడితే లేదా తప్పుగా వాడితే నిద్రమత్తు, మలబద్ధకం, శ్వాస నెమ్మదించడం, క్రమంగా ప్రాణాంకతం కావచ్చు. జనాభా శాతంతో చూస్తే ఒపియాయిడ్ సమస్య మిజోరం, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, మణిపూర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పదేళ్ల వయసు నుంచి 75 ఏళ్ల వృద్ధుల వరకు దాదాపు 2% మంది హెరాయిన్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారని 2018 నాటి సర్వేలో బయటపడింది. అలాగే పాఠశాల విద్యార్థుల్లో వీటి వినియోగం 2.8 శాతంగా నమోదైంది. హెరాయిన్‌కు బానిసైన యువతలో చదువు, ఉద్యోగం, సామాజిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం ఉంటోంది. శారీరక, మానసిక ఆరోగ్యం బాగా దెబ్బతింటోంది.డ్రగ్స్ అక్రమ రవాణాలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్‌లో ప్రస్తుతం హెరాయిన్ లభ్యత బాగా తగ్గిపోవడంతో దాని స్థానంలో ఫార్మాస్యూటికల్ డ్రగ్స్ వినియోగం యువతలో పెరిగింది. ఈ ఫార్మాస్యూటికల్ మత్తు పదార్థాలు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో పంజాబ్ లోకి వస్తుండడం వీటిని నివారించడం పోలీస్‌లకు పెద్ద సవాలుగా మారింది. ఈ ఫార్మాడ్రగ్స్‌లో ఎక్కువ భాగం పంజాబ్‌లో తయారు కావడం లేదు. ఇవి హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీల్లో తయారవుతున్నాయి. ఈ రాష్ట్రాలకు సంబంధించిన మత్తుమందుల్లో 11.54 లక్షల ఫార్మాస్యూటికల్ మాత్రలు, కాప్సూల్స్‌ను గత సంవత్సరం నుంచి స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లో అందుబాటులో ఉన్న ఈ డ్రగ్స్ లో సుమారు 80% ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని అంచనా. ఇది గతంలో ఉన్న పరిస్థితికి పూర్తి విరుద్ధం. అప్పట్లో పంజాబ్ లోకి అక్రమంగా వచ్చే డ్రగ్స్‌లో సుమారు 80 శాతం పాకిస్థాన్ సరిహద్దు అవతలి నుంచి అక్రమ రవాణా అయ్యేవి. 2024లో పంజాబ్‌లో పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. 2024 తొలి ఆరు నెలల్లోనే 215 కిలోల హెరాయిన్ స్వాధీనం అయింది.ఇప్పుడు కొత్త ధోరణి పంజాబ్‌లో కనిపిస్తోంది. ఫార్మా ఔషధాల దుర్వినియోగం ఎక్కువైంది. ఇప్పుడు ఫార్మాడ్రగ్స్ ఉత్పత్తి అయ్యే రాష్ట్రాలు, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించే మార్గం లోని రాష్ట్రాలు కలిసి డ్రగ్స్ తయారీదారులు, పంపిణీదారులు, అలాగే వ్యవస్థీకృతంగా పనిచేస్తున్న డ్రగ్ నెట్‌వర్క్‌లపై సమన్వయంతో చర్యలు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. డ్రగ్స్ తయారీ యూనిట్ల నియంత్రణ, విక్రయం, కొనుగోలు, రవాణా వీటిన్నిటినీ పర్యవేక్షించడం, అవి పంజాబ్‌కు అక్రమంగా మళ్లించబడకుండా నిరోధించడం తదితర కార్యకలాపాల నివారణకు పాకిస్థాన్ సరిహద్దు నుంచి డ్రోన్ల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి బిఎస్‌ఎఫ్, పోలీస్ దళాలు బహుళ స్థాయి చర్యలు చేపట్టారు. ఈ చర్యల ఫలితంగా పంజాబ్‌లో వీధుల్లోనే విచ్చలవిడిగా లభించే హెరాయిన్‌ను అడ్డుకోగలిగారు. దీంతో పంజాబ్ యువతకు హెరాయిన్ లభ్యంకాక, మత్తు కలిగించే ఫార్మాడ్రగ్స్ వాడటం ప్రారంభమైంది. సెప్టెంబర్ 3న మొబైల్ డ్రోన్ గుర్తింపు వేదిక అయిన 'డ్రోన్ సెన్స్ డి 200 ప్రో'కు చెందిన మూడు యూనిట్లు సరిహద్దు జిల్లాల్లోని వ్యూహాత్మక ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి. డ్రగ్స్‌ను అక్రమంగా రవాణా చేసే డ్రోన్లకు సంబంధించిన కార్యకలాపాలను గుర్తించి, వాటి ఖచ్చితమైన స్థానాన్ని, డ్రోన్లు ఎక్కడైతే డ్రగ్స్‌ను విడిచిపెడతాయో కనుక్కోగలగడం ఈ డ్రోన్‌సెన్స్ డి 200 ప్రో వ్యవస్థ లక్ష్యం. దీని ద్వారా భద్రతా సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని చర్యలు తీసుకోగలుగుతుంది.ఈ చర్యల కోసం 52 డ్రోన్ రెస్పాన్స్ టీమ్స్ (డిఆర్‌టిఎస్) ఏర్పాటయ్యాయి. వీటిలో 147 మంది పోలీస్ సిబ్బంది ఉంటారు. ఈ బృందాలు బిఎస్‌ఎఫ్‌తో కలిసి పనిచేస్తాయి. డ్రోన్ల డ్రగ్స్ రవాణా సంబంధమైన హెచ్చరికలు వచ్చిన వెంటనే ఈ బృందాలు స్పందించి డ్రోన్లు ఎక్కడైతే డ్రగ్స్‌ను జారవిడిచాయో అక్కడకు వెళ్లి నిఘా ఉంటాయి. ఆ ప్రదేశాల్లో గస్తీ కాసి, డ్రగ్స్‌ను తీసుకెళ్లడానికి వచ్చిన వారిని పట్టుకుంటాయి. ఈమేరకు పోలీసులు మొత్తం 9 యాంటీ డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీటిలో 3 'బాజ్'యాంటీడ్రోన్ వ్యవస్థలు. గత సంవత్సరం ఆగస్టు నుంచి అమృత్‌సర్, తరన్ తారన్, ఫిరోజ్‌పూర్ ప్రాంతాల్లో ఇవి పనిచేస్తున్నాయి. ఇవి డ్రగ్స్ రవాణా డ్రోన్ల కదలికలను ముందుగానే పసికట్టి వాటి కమ్యూనికేషన్‌ను స్తంభింప చేస్తాయి. అలాగే సరిహద్దు ప్రాంతాల్లో విలేజీ డిఫెన్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలే పోలీసులకు కళ్లు, చెవులుగా పనిచేస్తాయి. 'యుద్ధ్ నషా విరుద్ధ్ (మాదకద్రవ్యాల వ్యతిరేక) ప్రచారం ద్వారా 2025 మార్చి 1నుంచి డ్రగ్స్ అక్రమ రవాణాదారులైన దాదాపు 80,000 మందిని అరెస్ట్ చేశారు. డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆర్థిక పునాదులను దెబ్బతీయడానికి ఆర్థిక ఆంక్షలతో కూడిన చర్యలను తీసుకుంటున్నారు. డ్రగ్స్ ఉత్పత్తికి, అక్రమ రవాణాకు పాల్పడిన వారికి సంబంధించిన రూ. 336 కోట్లకు పైగా ఆస్తులను స్తంభింప చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సమాచారం ఎవరైనా తెలియజేసినా, వాటి ఆచూకీ చెప్పగలిగినా అలాంటి వారికి రివార్డు పాలసీని అమలు చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా డ్రోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నందుకు రూ. 25,000 నగదు బహుమతిని అందిస్తున్నారు.

## మళ్లీ తెరపైకి ఉమ్మడి పౌరస్మృతి



జనసంఘ్ 1957, 1962 ఎన్నికల ప్రణాళిక లు హిందూ కోడ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరాయి. కానీ ఉమ్మడి పౌర స్మృతి గురించి ప్రస్తావించలేదు. ఈ డిమాండ్ 1967 ప్రణాళికలో కనిపించినప్పటికీ, 1971 లో మాయమైంది. 1980లో వచ్చిన బిజెపి తొలి ఎన్నికల ప్రణాళికలో కూడా దీని గురించి ఏమీ పేర్కొనలేదు. అటల్ బిహారీ వాజ్‌పేయి పార్టీ అధ్యక్షుడిగా ఉన్న 1984లో కూడా పరిస్థితి అలాగే ఉంది. కానీ ఎనభైల మధ్యలో ఎల్‌కె అద్వానీ నాయకత్వంలోని పార్టీ మూడు అంశాలను ప్రధాన ఎజెండాగా తీసుకుంది: యుసిసి, ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం. 1985 నాటి షా బానో కేసు సమయంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి యుసిసిని తమ ప్రధాన డిమాండ్లలో ఒకటిగా మార్చుకున్నాయి.ప్రజలలో ఏదైనా అంశంపై ప్రభుత్వం ప్రతికూలత ఎదుర్కొంటున్న సమయంలో ఆ అంశాన్ని పరిష్కరించే ప్రయత్నం చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు భావోద్వేగం కలిగించే మరో అంశాన్ని తెరపైకి తీసుకు రావడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. ముఖ్యంగా ఈ విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు విధానపరంగా ఎటువంటి చొరవ చూపించలేక, భావోద్వేగ అంశాలతో ప్రజలలో కలకలం సృష్టించి పబ్బం గడుపుకోవడంలో ఆరితేరింది.జులై 20న ఢిల్లీలో విద్యార్థులు, యువకులపై ఢిల్లీ పోలీసులు అమానుషంగా విరుచుకుపడిన సంఘటన మొత్తం దేశ ప్రజలను ఆందోళనకు గురిచేస్తుంటే, హోంమంత్రిగా కనీసం పార్లమెంట్ ముందుకు వచ్చి అసలేమీ జరిగిందో చెప్పే సాహసం చేయలేకపోయిన అమిత్ షా పార్లమెంట్ ముగియగానే బిజెపితోపాటు ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లో 2029లోపు ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) అమలు చేసి తీరుతామని ప్రకటించారు. దేశంలో 21 రాష్ట్రాల్లో బిజెపి, ఎన్‌డిఎ పాలన నడుస్తోందని, ఈ రాష్ట్రాల్లో 2029లోపు యుసిసిని అమలు చేస్తామని తెలిపారు.

# రైతు భరోసాకు డ్రోన్ టెక్నాలజీ




వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం వేగం పుంజుకుంటోంది. పంటలకు పురుగు మందులు, ద్రవ ఎరువుల పిచికారీతోపాటు పంటల పర్యవేక్షణ, వ్యవసాయ సేవలను వేగంగా అందించడంలో డ్రోన్ల వినియోగం విస్తరిస్తోంది. రైతులకు డ్రోన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు గ్రామీణ మహిళలు, యువతకు కొత్త ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, కిసాన్ డ్రోన్ల ప్రోత్సాహానికి ఇప్పటివరకు రూ. 141.39 కోట్లు విడుదలయ్యాయి. రైతులకు 527 డ్రోన్లు అందించడంతోపాటు 1,595 డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రైతుల పొలాల్లో 27,099 డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించి, సుమారు 30.23 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రదర్శనలు చేపట్టగా, 3.51లక్షల మంది రైతులు వాటి ద్వారా లబ్ధి పొందారు. డ్రోన్ వినియోగానికి సంబంధించి 287 మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇచ్చినట్లు కేంద్రం తెలిపింది. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి పరిశోధన, ప్రయోగాల ద్వారా పునాది పడింది.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంనకు 2021లో డి జిసిఎ అనుమతులు లభించడంతో పంట రక్షణ, పురుగు మందుల పిచికారీ, తెగుళ్లు, వ్యాధుల గుర్తింపుపై డ్రోన్లతో పరిశోధనలు జరిగాయి. 2022లో వరి పంటలో డ్రోన్ ఆధారిత పిచికారీకి ప్రామాణిక విధానం రూపొందించగా, అనంతరం వరి, పత్తి, కంది, వేరుశెనగ, సోయాబీన్, నువ్వులు, కుసుమ వంటి ఏడు పంటలకు పంట –నిర్దిష్ట డ్రోన్ పిచికారీ విధానాలు అభివృద్ధి చేసినట్లు రిచ్ నివేదిక పేర్కొంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం, పిజెటిఎస్‌ఎయు, రిచ్, అగ్రిటెక్ స్టార్టప్‌ల భాగస్వామ్యంతో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పొలాల్లో పరీక్షించే కార్యక్రమాలు చేపట్టాయి. డ్రోన్ టెక్నాలజీతో పాటు పంట పర్యవేక్షణ, నీటి నిర్వహణ, పోషక యాజమాన్యం వంటి అంశాల్లోనూ సాంకేతిక పరిష్కారాలను పరీక్షించారు. ఈ చర్యల ద్వారా తెలంగాణలో డ్రోన్ ఆధారిత వ్యవసాయానికి పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, ప్రయోగాల స్థాయిలో పునాది ఏర్పడింది. భవిష్యత్తులో ఈ సాంకేతికతను రైతులకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం వ్యవసాయ యాంత్రీకరణలో కీలకంగా మారనుంది. డ్రోన్ టెక్నాలజీని గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతతో అనుసంధానించేందుకు 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. 202324 నుంచి 2025–26 వరకు అమలయ్యే ఈ పథకానికి రూ. 1,261కోట్ల కేటాయింపుతో ఎంపిక చేసిన మహిళా స్వయం సహాయక సంఘాలకు 15,000 డ్రోన్లు అందించాలన్నది లక్ష్యం. ఈ సంఘాలు రైతులకు అద్దె ప్రాతిపదికన డ్రోన్ సేవలను అందించేలా పథకాన్ని రూపొందించారు.ఈ పథకం కింద డ్రోన్ ఖర్చులో 80% వరకు, గరిష్ఠంగా రూ. 8 లక్షల వరకు కేంద్ర ఆర్థిక సహాయం అందుతోంది. డ్రోన్‌తోపాటు స్ప్రే అసెంబ్లీ, అదనపు బ్యాటరీలు, నిర్వహణ, బీమా, డ్రోన్ పైలట్, సహాయకుడి శిక్షణ వంటి సదుపాయాలను ప్యాకేజీలో చేర్చారు. 2026 జనవరి నాటికి ప్రధాన ఎరువుల కంపెనీలు స్వయం సహాయక సంఘాలకు 1,094 డ్రోన్లు పంపిణీ చేయగా, అందులో 500 డ్రోన్లు నమో డ్రోన్ దీదీ పథకం కింద పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటి నిర్వహణకు ఎంపికైన మహిళలకు డిజిసిఎ అనుమతించిన శిక్షణ సంస్థల్లో డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చారు. తెలంగాణలోనూ ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం లభిస్తోంది. కేంద్రం వెల్లడించిన రాష్ట్రాల వారీ వివరాల ప్రకారం, నమో డ్రోన్ దీదీ పథకం కింద పంపిణీ చేసిన తొలి 500 డ్రోన్లలో తెలంగాణకు చెందిన 72 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లు, గ్రామస్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకులతోపాటు కిసాన్ డ్రోన్ల ప్రదర్శనలు, కొనుగోలు, డ్రోన్ కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పంటలపై రసాయనాల పిచికారీ నుంచి పంట పర్యవేక్షణ వరకు డ్రోన్ల వినియోగం విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్తులో వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతకు మరింత ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. రైతులకు డ్రోన్ సేవలు సులభంగా, తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వస్తే వ్యవసాయ యాంత్రీకరణకు మరింత ఊతం లభించే అవకాశముంది.

# ముందు చూపేది...?




ఒకవైపు ఎల్‌నినో ప్రభావం.. మరోవైపు పాలకుల వైఫల్యం... వెరసి అన్నదాత పాలిట శాపంగా పరిణమించాయి. ఎల్‌నినో ప్రభావం కేవలం తెలంగాణపైనే కాదు.. యావత్ దేశంపై కూడా ఉందనే విషయం వాస్తవమే అయినా, ఇక్కడ ప్రకృతి ప్రకోపానికి తోడు ప్రభుత్వాలకు ముందు చూపు లేకపోవటం సాగుకు కష్టాలను తెచ్చిపెట్టింది. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు సాగునీటిని అందించాలంటూ రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు కోరుతూ వచ్చారు. కానీ పాలకులు ఆ మాటలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితం ఇప్పుడు మనం అనుభవిస్తున్న కరువు, కాటకాలు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతూ వచ్చింది. నేటి కాంగ్రెస్ సర్కారు కూడా అదే డిమాండ్‌ను వినిపిస్తోంది. కానీ అదే డిమాండ్‌పై పాలకులకు స్పష్టంగా ఒక కార్యాచరణగానీ, పోరాట పటిమగానీ లేకపోవటం శోచనీయం. ఆ ప్రాజెక్టుకు సంబంధించి 2023లో కేసీఆర్ ప్రభుత్వం ట్రయల్ రన్‌ను ప్రారంభించింది. రేవంత్ రెడ్డి సర్కారు కూడా ఈ యేడాది ఆరంభంలో అదే ట్రయల్ రన్‌ను చేపట్టింది. కానీ రెండు ప్రభుత్వాలూ నీళ్లను లిఫ్ట్ చేసేందుకు మాత్రం ఏ ఒక్క రోజూ ప్రయత్నించకపోవటం గమనార్హం. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో 70 టీఎమ్‌సీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ఆ మేరకు నీటిని నిల్వ చేయగలిగితే రైతులకు ఎంతో మేలు జరిగేది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, నీటిని నిల్వ చేయకపోవటం వల్ల ప్రతీయేటా గోదావరి నుంచి మూడు వేల టీఎమ్‌సీలు సముద్రం పాలవుతున్నాయని నీటిపారుదల నిపుణులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఎల్‌నినో వియలతాండవం చేస్తున్న ప్రస్తుత తరుణంలో కూడా ఆ నది నుంచి వెయ్యి టీఎమ్‌సీలు సముద్రంలో వృథాగా కలిపిపో యాయంటే ఆ పాపం ఎవరిది? ప్రతీ చుక్క నీటిని ఒడిసిపట్టండంటూ ప్రజలకు పదే పదే విజ్ఞప్తులు చేసే ప్రభుత్వం... గోదావరి నుంచి సముద్రంలో కలిసే నీటిని ఎందుకు ఒడిసిపట్ట లేకపోతోంది? ఇది ముమ్మాటికీ పాలకుల వైఫల్యానికి నిదర్శనమే.ఇక ప్రస్తుతం తీవ్ర వివాదంగా మారిన జూరాల విషయానికొస్తే... ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి జాగ్రత్తతోపాటు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోం దంటున్నారు సాగునీటిరంగ నిపుణులు. ఇప్పటికిప్పుడు జూరాలలో 8 టీఎమ్‌సీల నీరు నిల్వ ఉంది. వాటిని విడుదల చేసి, రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఈ అంశంలో రేవంత్ సర్కారు ఎక్కువ భయపడుతున్నట్టుగా కనబడుతోంది. ఎందుకంటే ఇప్పుడు ప్రతీ ఊరికీ మంచినీరు స్థానంలో, ప్రతీ ఇంటికీ మంచినీరు అందుతోంది. ఒకవేళ ఇప్పటికిప్పుడు జూరాలతోపాటు ఇతర ప్రాజెక్టుల్లోని నీటిని విడుదల చేస్తే... మున్ముందు తాగునీటికి కటకట ఏర్పడుతుందనే ఆందోళన ప్రభుత్వ పెద్దలను వెంటాడుతోంది. ఇప్పటిదాకా తాగునీటికి ఢోకా లేకుండా పోయిన నేపథ్యంలో భవిష్యత్తులో ఒక్కసారిగా తాగటానికి నీరు లేక గొంతెండితే తమ పరిస్థితి పూర్తిగా కిందా మీదా అవుతుందనే భావన వారిలో నెలకొంది. అందుకే ఈ తాత్సారం. ఎల్‌నినో గురించి పర్యవరణవేత్తలు, శాస్త్రవేత్తలు ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ పరిస్థితిని ముందే ఊహించి, తగు ప్రణాళికలు తీసుకుంటే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చేది కాదుగదా? ఎల్‌నినో దృష్ట్యా వరి వేయొద్దు, ఆరు తడి పంటలు వేసుకోండంటూ రైతులను హెచ్చరిస్తే... అసలు ఇలా భయపడాల్సిన అవసరమే రాదు కదా? తీరా ఇప్పుడు వరి చేలు పొట్టదశకు వచ్చిన తర్వాత నీటిని విడుదల చేయలేం, రైతులు జాగ్రత్తలు తీసుకోండంటూ చెబితే అన్నదాత ఏం చేయాలి? ఈ క్రమంలో మన రాష్ట్ర మంత్రులు, కర్నాటకకు వెళ్లి, జూరాలకు మూడు టీఎమ్‌సీల నీటి విడుదలకు అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించటం హర్షణీయమే. అయితే అదే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. అందుకే... ఇప్పటికైనా రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయటంపై సర్కారు దృష్టి సారించాలి. ఆ మేరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

# యువతకు భరోసా ఏదీ?




దేశంలో యువతే అత్యంత పెద్ద వనరు. జనాభాలో యువత వాటా ఎక్కువగా ఉండటం భారతదేశానికి ఉన్న గొప్ప బలంగా చెప్పుకుంటున్నాం. ఆ యువతే ఇప్పుడు సరైన అవకాశాలు దొరక్క తీవ్ర నిరాశలో ఉంది. ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగం లభించడం లేదు. సొంతంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచు కునేందుకు సిద్ధమైనా పెట్టుబడి, రుణ సదుపాయాలు కరువయ్యాయి. యువత ఉపాధి పరిస్థితిపై కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్‌ఎఫ్‌ఎస్) నివేదిక ఇదే విషయాన్ని గణాంకాల రూపంలో స్పష్టం చేసింది. 2025 వార్షిక నివేదిక ప్రకారం దేశంలో 15 నుంచి 29 ఏండ్ల యువత నిరుద్యోగిత రేటు 9.9 శాతం. అంటే ప్రతి వంద మంది యువ కార్మికుల్లో దాదాపు పది మంది పని కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత నిరుద్యోగిత 8.2 శాతం కాగా, పట్టణ ప్రాంతాల్లో పురుషులకు 11.8 శాతం, మహి ళలకు 18.9 శాతంగా నమోదైంది. యువశక్తిని సరైన దిశలో వినియోగించడంలో ప్రస్తుత పాలకులు పూర్తిగా విఫలయ్యారని చెప్పడానికి లెక్కలే నిదర్శనం. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత ప్రస్తుతం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొం టోంది? చదువు పూర్తయిన తర్వాత వారి ముందున్న ప్రధాన సవాళ్లు ఏమిటి? ఉద్యోగం కావాలా..స్వయం ఉపాధి కావాలా? ప్రభుత్వ ఉద్యోగంపైనే ఆశలు పెట్టుకున్నారా? ప్రయి వేటు రంగంలో అవకాశాల కోసం చూస్తున్నారా? లేక విదేశీ విద్య, విదేశీ ఉద్యోగాల వైపు అడుగులు వేస్తున్నారా? యువత ఆలోచనలను అర్థం చేసుకునేందుకు నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ ఉద్యోగాలపై ఆసక్తి ఏ మాత్రం తగ్గలేదని తేలింది. ఉద్యోగ భద్రత, సామాజిక గౌరవం, పదవీ విరమణ ప్రయోజనాలు, స్థిరమైన కెరీర్ వంటి అంశాలు యువతను ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఇప్పటికీ ఆకర్షిస్తున్నాయి. డిగ్రీలు పెరుగుతున్నా వాటికి తగ్గ ఉద్యోగ అవకాశాలు పెరగడం లేదనే భావన కూడా వ్యక్తమైంది.

# మిక్స్‌డ్ రీలేలో రజతం.. మారథాన్‌లో సీమకు చరిత్రాత్మక కాంస్యం..!

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. ఐదో రోజు షూటర్లు వెండి వెలుగులు విరజిమ్మగా.. అథ్లెట్లు కూడా పోడియంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. పది వేల మీటర్ల పరుగులో సీమా కుమారి కంచు మోత మోగించింది. సీమ కాంస్యం అందుకున్న ఇరవై నిమిషాల్లోనే మిక్స్‌డ్ రీలే(4ఐ400 మీటర్ల) ఫైనల్లో భారత బృందం రజతం ఒడిసిపట్టింది. ఫలితంగా భారత్ ఖాతాలో 17 పతకాలు చేరాయి.జపాన్‌లోని నగోయలో జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకపోరులో దూసుకెళ్తున్నారు. మిక్స్‌డ్ రీలే (4ఐ400 మీటర్ల) విభాగంలో . మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పూవమ్మ రాజు, విశాల్ థెన్నరసు, విథ్యా రామరాజు, మను టీఎస్‌లు రెండో స్థానంతో రజతం గెలుపొందారు. గురువారం ఫైనల్లో.. విథ్యా, విశాల్ చిరుతలా పరుగెత్తారు. వీరి కృషి ఫలితంగా ఈ టోర్నీలో తమ రికార్డును కాపాడుకుంది మిక్స్‌డ్ రీలే బృందం. ఇదివరకు 2018లో స్వర్ణం, 2022 ఎడిషన్‌లో భారత టీమ్ రజతం గెలుపొందింది.






# అండర్-15 ఆసియాకప్ పోటీలకు వరంగల్ క్రీడాకారిణి ఎంపిక




హనుమకొండ చౌరస్తా : అండర్-15 ఆసియాకప్ పోటీల్లో ఇండియన్ సాఫ్ట్‌బాల్ జట్టులో ఆడేందుకు వరంగల్ క్రీడాకారిణి వేల్పుల సాయివర్షిని ఎంపిక అయ్యింది. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 5వ అండర్-15 ఉమెన్స్?? సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొననుందని హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్ తెలిపారు.ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శ్వేతను మర్యాదపూర్వకంగా కలవడంతో ఆమె క్రీడాకారిణిని అభినందించారు. సీపీ మాట్లాడుతూ ఇండియన్ టీంకు సాయివర్షిని ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు. సాయివర్షినినీ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ పోలేపాక వినయ్ , సాయివర్షిని తండ్రి అనిల్, అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ ఉన్నారు.

# పాకిస్థాన్‌తో ఆఖరి ఓవర్ థ్రిల్లర్.. ఆ ఉద్విగ్న క్షణాలకు 19 ఏళ్లు..!



పురుషుల టీ20 ప్రపంచకప్‌ను ఒకటి కాదు ఏకంగా మూడుసార్లు ముద్దాడింది భారత జట్టు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడం చిన్న విషయమేమీ కాదు. కానీ, అప్పుడప్పుడే పొట్టి క్రికెట్ వైపు అడుగులు పడుతున్న వేళ 'మెన్ ఇన్ బ్లూ' తొలిసారి ఈ ఐసీసీ ట్రోఫీని అందుకున్న క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయమే. తొలిసారి నిర్వహించిన ఈ మెగా టోర్నీలో జులపాల ఎంఎస్ ధోనీ సారథ్యంలోని టీమిండియా అబ్బురపరిచే ఆటతో కప్‌ను ఒడిసిపట్టింది. అది కూడా ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో పాకిస్థాన్‌ను ఓడించి. టీమిండియా, ధోనీ ఘనతల్లో కలకాలం నిలిచిపోయిన ఈ మొట్టమొదటి పొట్టి వరల్డ్‌కప్ విజయానికి సరిగ్గా నేటితో 26 ఏళ్లు.క్రికెట్‌లో ఇప్పుడు టీ20లదే హవా. బ్యాటర్ల వీరకొట్టుడు, ఉత్కంఠ పోరాటాలు, ఆఖరి ఓవర్ థ్రిల్లర్.. అబ్బో ఈ ఆట ఇచ్చే కిక్కే వేరు. అయితే.. 2007లోనే క్రికెట్ ప్రియులకు అసలు సిసలైన టీ20 మజాను పంచింది టీమిండియా. ఆ ఏడాది ఐసీసీ తొలిసారిగా ప్రవేశపెట్టిన పొట్టి వరల్డ్‌కప్‌ను సంచలన ఆటతో లేని ధోనీ సారథ్యంలోని భారత జట్టు గెలుపొందింది. సెమీస్‌కు ముందు ఇంగ్లండ్‌పై యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లతో చరిత్ర సృష్టించగా.. పాకిస్థాన్‌తో ఫైనల్ మరింత థ్రిల్‌నిచ్చింది. నరాలు తెగే ఉత్కంఠ రేపిన ఫైనల్లో జోగిందర్ శర్మ వేసిన ఆఖరి ఓవర్‌ను, శ్రీశాంత్ పట్టిన సూపర్ క్యాచ్‌ను భారత అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేరు.



# భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేదు.. మమల్ని ఎదుర్కొనే అనుభవమూ లేదు..!

ఫిఫా వర్ల్డ్‌కప్ వేళ టీవీలకు అర్ధ రాత్రిళ్లు మేల్కొని టీవీలకు అతుక్కున్న భారతీయులు స్వదేశంలో బ్రెజిల్‌తో మ్యాచ్‌కోసం కోటి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మాజీ ఛాంపియన్ అయిన ఈ దక్షిణ అమెరికా జట్టుతో ఫ్రెండ్లీ పోరు తమకు బోల్డెంత కిక్ ఇస్తుందని అనుకుంటున్నారు. విదేశీ స్టార్లను ప్రత్యక్షంగా చూసే రోజు సమీపిస్తుండగా బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలొట్టి సంచలన వ్యాఖ్యాలు చేశాడు. కోల్‌కతాలో అక్టోబర్ 3న జరుగనున్న మ్యాచ్‌ను ఉద్దేశించి గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేదని అన్నాడు. సాకర్‌లో మనదేశం వెనకబడడానికి గల కారణాలను, కొత్తతరం ఆటగాళ్ల కోసం కీలక సూచనలు చేశాడు.భారత్, బ్రెజిల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు గడువు దగ్గరపడుతోంది. అక్టోబర్ 3వ తేదీన కోల్‌కతాలో ఇరుజట్లు ఫ్రెండ్లీగా తలపడనున్నాయి. ఈ బిగ్ మ్యాచ్ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలొట్టి త్వరలోనే భారత్ రానున్నాడు. కోల్‌కతాను చూసేందుకు ఆతృతగా ఉన్నానని పేర్కొన్న కార్లో.. భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేదంటున్నాడు. బ్రిస్బేన్‌లో మీడియాతో మాట్లాడిన కార్లో బ్రెజిల్‌లో అంతులేనంతగా ఫుట్‌బాల్ సంస్కృతి ఉందని చెప్పాడు. కానీ, ప్రపంచ స్థాయి జట్లను ఎదుర్కొనేంత అనుభవం టీమిండియాకు లేదని ఆయన కుండబద్దలు కొట్టేశాడు.

# ముంబై ఇండియన్స్ గూటికి ఆర్సీబీ కోచ్.. మనోడి ట్రాక్ రికార్డు తెలుసా..!




ఫ్రాంచైజీ క్రికెట్‌లో అదరగొడుతున్న ముంబై ఇండియన్స్‌కు కొత్త హెడ్‌కోచ్ వచ్చేశాడు. మహిళల ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ ముంబై తదుపరి కోచ్‌గా ల్యూక్ విలియమ్స్ నియమితుల య్యాడు. కీట్లే లీసా స్థానంలో ఈ ఆస్ట్రేలియా దిగ్గజం త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నాడు. మహిళల క్రికెట్‌పై లోతైన అవగాహన, సుదీర్ఘ కోచింగ్ అనుభవమున్న విలియమ్స్ తమ జట్టును విజయవంతం చేస్తాడని ముంబై యాజమాన్యం భావిస్తోంది. కొత్త కోచ్‌గా అతడి నియామకాన్ని గురువారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది.మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ ఐదో సీజన్‌లో కొత్త కోచ్ మార్గనిర్దేశనంలో ఆడనుంది. కీట్లే లీసా స్థానంలో ల్యూక్ విలియమ్స్ ముంబై హెడ్‌కోచ్‌గా నియమితులయ్యాడు. డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ తొలిసారి ట్రోఫీని ముద్దాడడంలో కీలకమైన విలియమ్స్ ఇకపై ముంబై విజయాల్లో భాగం కానున్నాడు. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లోనూ అతడు స్ట్రయికర్స్ జట్టును వరసగా రెండుసార్లు (2022, 2023) ఛాంపియన్‌గా నిలిపాడు.

# బీసీసీఐతో దోస్తీ.. టీమిండియా టైటిల్ స్పాన్సర్‌గా 'ముత్తూట్ ఫిన్‌కార్ప్'..!




ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ పంట పండనుంది. బంగారంపై రుణాలతో అందరికీ చేరువైన ఈ సంస్థ భారత క్రికెట్ నియంత్రణ మండలితో దోస్తీకి సిద్ధమైంది. పలు సంస్థలను వెనక్కి నెట్టి భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు దక్కించుకుంది సంస్థ. వచ్చే రెండేళ్ల పాటు టీమిండియా జెర్సీలపై ముత్తూట్ పేరు తళుక్కుమననుంది. 'బ్లూ ముత్తూట్' పేరుతో టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది కంపెనీ. అయితే.. స్వదేశంలో టీమిండియా ఆడే మ్యాచ్‌లకు మాత్రమే పరిమితం కానుందని సమాచారం.క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్‌లో భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌గా కంపా, ఎస్‌బీఐ లైఫ్, చాట్‌జీపీటీలు ఉన్నాయి. ఇప్పుడు వీటి సరసన ముత్తూట్ ఫిన్‌కార్ప్ కూడా చేరనుంది. రెండేళ్ల కాలానికి బీసీసీఐతో ముత్తూట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అంటే.. 2028 మార్చి 31 వరకూ ఈ హోదాలో కొనసాగనుంది కొచ్చికి చెందిన ఫైనాన్స్ కంపెనీ. అయితే.. ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్.. కొరియాపై భారత్ విక్టరీ



టోక్యో: ఆసియా క్రీడల హాకీ ఈవెంట్‌లో ఇండియా దుమ్మురేపుతోంది. పూల్ ఏ నుంచి భారత జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇవాళ దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా 8-2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత స్ట్రయికర్ దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దిల్‌ప్రీత్‌తో పాటు అభిషేక్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, రాజిందర్ సింగ్ కూడా గోల్స్ చేశారు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే తొలిసారి దక్షిణ కొరియాపై ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ విక్టరీతో ప్రస్తుతం పూల్ ఏ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు జపాన్‌తో భారత్ తలపడనున్నది.

# మిక్స్‌డ్ టీమ్ స్కీట్‌లో కాంస్యం గెలిచిన అనంత్ జీత్, పరినాజ్




న్యూఢిల్లీ: జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో ఇండియాకు మరో పతకం వచ్చింది. షూటింగ్‌కు చెందిన మిక్స్‌డ్ టీమ్ స్కీట్ ఈవెంట్‌లో భారత జోడి అనంత్ జీత్ సింగ్ నరూకా, పరినాజ్ ధలీవాల్.. పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆ బృందానికి కాంస్య పతకం వచ్చింది. ఫైనల్ రౌండ్‌లో ఇండియన్ జోడి 44 పాయింట్లు స్కోరు చేసి మూడవ స్థానంలో నిలిచింది. ఆరు సిరీస్‌ల గేమ్‌లో ఇద్దరూ మెరుగైన ప్రదర్శన ఇచ్చారు. ఓపెనింగ్ సిరీస్‌లో 14, 21, 29, 36 స్కోరు చేసిన ఆ జంట ఓ దశలో ఏడో స్థానంలో ఉన్నది. కానీ చివరి రౌండ్‌లో 44 పాయింట్లు స్కోరు చేసి బ్రాంజ్ పతకాన్ని సొంతం చేసుకున్నారు. 138 సగటు స్కోరుతో అనంత్ జీత్, పరినాజ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో నాలుగో స్థానంలో నిలిచారు. దీంతో ఆసియా క్రీడల్లో షూటింగ్ విభాగంలో భారత పతకాల సంఖ్య 8కి చేరింది. షూటింగ్ ఈవెంట్‌లో ఇండియాకు నాలుగు సిల్వర్, నాలుగు బ్రాంజ్ మెడల్స్ దక్కాయి.

# 'జార్జ్ క్రిష్' కథానాయిక..



దర్శకుడు శ్రీను వైట్లతో హీరో శర్వానంద్ తొలిసారి సినిమా చేస్తున్నారు. వీరి కాంబోలో 'జార్జ్ క్రిష్' సినిమా పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించనుంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కపుల్ ఫ్రెండ్లీ' తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి ఇందులో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.



# విడుదల తేదీ వాయిదా

హీరో వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న వినోదాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం -- ఏకే47' విడుదల తేదీ మారింది. తొలుత ప్రకటించిన తేదీ కంటే వారం ఆలస్యంగా, ఈ చిత్రాన్ని అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. వినోదం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు.

## 'పారడైజ్' సినిమా.. కేసీఆర్ పాత్రలో ఆకట్టుకున్న ప్రియదర్శి



హైదరాబాద్ : నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామా ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ సందడి చేస్తోంది. ముఖ్యంగా ప్రియదర్శి పోషించిన ఎమ్మెల్యే శంకర్ పాత్రపై చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో ప్రియదర్శి తెలంగాణ రాజకీయ నాయకుడిని పోలిన గెటప్‌లో కనిపించినట్లు అభిమానులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆయన హావభావాలు, మాటతీరు, తెలంగాణ యాస ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.కొన్ని సన్నివేశాల్లో మాజీ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలినట్లు అనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కేసీఆర్ ప్రసంగాల్లో కనిపించే శైలి, బాడీ లాంగ్వేజ్‌ను గుర్తు చేసేలా ప్రియదర్శి నటన ఉందంటూ అభిమానులు పోస్టులు చేస్తున్నారు. సినిమాలో ఆయన పాత్ర ఎలా సాగుతుంది? ఎలాంటి సన్నివేశాల్లో కనిపిస్తారు? అన్నది తెరపై చూడాల్సిందే. అయితే సినిమా విడుదలైన వెంటనే ప్రియదర్శి పాత్రకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.



## 'ఆ రోజు నాకు రెండో జీవితం దక్కింది'.. ఐదేళ్ల క్రితం ప్రమాదాన్ని గుర్తుచేసుకున్న సాయి దుర్గా తేజ్

మెగా హీరో సాయి దుర్గా తేజ్ జీవితంలో 2021 సెప్టెంబర్ నెలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ప్రమాదం నుంచి క్రమంగా కోలుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రమాదం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాయి దుర్గా తేజ్ చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇదే రోజున తనకు జీవితంలో రెండో అవకాశం లభించిందని సాయి దుర్గా తేజ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అందించిన అండ తన కోలుకునే ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. వారి ప్రేమ, ప్రార్థనలు, సందేశాలు తనకు కష్టమైన రోజుల్లో ముందుకు సాగేందుకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేసుకున్నారు.ప్రమాదంలో ఎదురైన గాయాల నుంచి తాను దాదాపు 90 శాతం వరకు కోలుకున్నానని సాయి దుర్గా తేజ్ తెలిపారు. అయితే మాటతీరు సహా కొన్ని విషయాల్లో ఇంకా పూర్తిగా మెరుగుపడేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రతిరోజూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ కోలుకుంటున్నానని పేర్కొన్నారు. కష్టమైన ప్రతి రోజు, ఎదురుదెబ్బ తగిలిన ప్రతి సందర్భం, వదిలేయడం సులభంగా అనిపించిన ప్రతి క్షణంలోనూ మీ ప్రేమే నాకు బలాన్ని ఇచ్చింది. ఐదేళ్ల తర్వాత కూడా నేను నిలబడి ఉన్నాను. పోరాడుతున్నాను.

# 'కర్ణ'గా రాఘవ లారెన్స్

పెన్ మూవీస్ అధినేత జయంతి లాల్ గడా సమర్పణలో.. ఆర్‌వీ స్టూడియోస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్ అసోసియేషన్‌లో.. దర్శకుడు రమేష్ వర్మ నుంచి ఐదు భాషల్లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ఎపిక్ 'కర్ణ'. మహాభారతంలోని మహా వీరుడు కర్ణుడి మహాగాథ మరో సారి ఆవిష్కృతం కానుంది. ఈ మహా యోధుడి పాత్రలో నటుడు రాఘవ లారెన్స్ నటిస్తున్నారు. దర్శకుడు రమేష్ వర్మ తనదైన విజన్‌తో ఈ పురాణగాథను భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. రూ.150 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో రూపొందుతోంది. ఐదు భాషల్లో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్ఠాత్మక ఎపిక్.. అత్యున్నత నిర్మాణ విలువలు, భారీ సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది. భారీ సెట్స్, అద్భుతమైన వరల్డ్ డిజైన్స్, భారీ



యాక్షన్ సన్నివేశాలు, అత్యున్నత స్థాయి వీఎఫ్‌ఎక్స్‌తో 'కర్ణ' ప్రపంచాన్ని ఇంతకు ముందెన్నడూ చూడని స్థాయిలో ఆవిష్కరి స్తున్నారు. మహాభారత కాలం నాటి రాజ్యాలు, యుద్ధభూ ములు, భారీ యుద్ధ సన్నివేశాలు.. ఇలా ప్రతి అంశాన్ని అత్యంత గ్రాండ్‌గా రూపొంది స్తున్నారు. నిజమైన సెట్స్ వైభవానికి అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ.. ప్రేక్షకులను కర్ణుడి ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.